


వీరాపురం చేరుకున్న సైబీరియన్ వలస పక్షులు

సైబీరియన్ పక్షులు వచ్చేశాయ్..

రారండోయ్..

వీరాపురం, వెంకటాపురం గ్రామాల్లో సందడి
విడిది కేంద్రాల పరిశీలన

సముద్రాలు దాటి, వేల కిలోమీటర్లు ప్రయాణించి అతిథి పక్షులు వచ్చేశాయి. సైబీరియా పక్షులు మండలంలోని వీరాపురం, వెంకటాపురం గ్రామాలకు చేరుకున్నాయి. పర్యాటకులకు కనువిందు చేసే సైబీరియన్ వలస పక్షులు వారం రోజులుగా సందడి చేస్తున్నాయి. వంద వరకు పక్షులు వచ్చాయి. జనవరి నుంచి ఆగస్టు వరకు ఈ ప్రాంతంలో ఎదురయ్యే వాతావరణ పరిస్థితులను ముందుగా ఇక్కడికి వచ్చి తెలుసుకుంటున్నాయి. అందులో భాగంగా ఆయా గ్రామాల్లో పక్షులు చక్కర్లు కొడుతున్నాయి. ఏటా జనవరి మొదటివారంలో సైబీరియా నుంచి పక్షుల గుంపు ముందుగా వచ్చి ఈ ప్రాంతంలోని వాతావరణ పరిస్థితులను పరిశీలిస్తుంది. విడిదికి ఇక్కడి వాతావరణం అనుకూలంగా ఉంటే అవి తిరిగి సైబీరియా వెళ్లి తమ జాతిని వెంట పెట్టుకుని, వీరాపురం, వెంకటాపురం గ్రామాలకు చేరుకుంటాయి. ఇది ఏటా జరిగే తంతు. అందులో భాగంగా నాలుగు రోజులుగా పెయింటెడ్ స్టార్క్‌లుగా పిలువపడే సైబీరియన్ పక్షులు ఇక్కడ తిరుగుతూ వాతావరణ పరిస్థితులను పరిశీలిస్తున్నాయి. - ఆంధ్రజ్యోతి, చిలమత్తూరు



ఆహారమే సమస్య

జిల్లాలో నెలకొన్న వాతావరణ పరిస్థితులు, వలస పక్షుల సంరక్షణపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడం తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దీంతో ఐదారేళ్లుగా పక్షుల రాక తగ్గిపోతోంది. గతేడాది మాత్రం ఎన్నడూ రాని విధంగా ఎక్కువ సంఖ్యలో పక్షులు గ్రామానికి చేరుకుని, సందడి చేశాయి. వచ్చిన పక్షులకు సరిపడా ఆహారం లేకపోవడంతో పర్యాటక గ్రామంగా ఉన్న వీరాపురంలో పక్షుల కిలకిల ధ్వనులకు బదులు ఆకలి కేకలు వినిపించాయి. ఇటువంటి పరిస్థితుల్లో పక్షుల ఆహార కొరత తీర్చడం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యామ్నాయ చర్యలు నామమాత్రంగా ఉన్నాయన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. దీంతో అతిథులకు ఆకలి బాధలు తప్పలేదు. దాంతో ఇక్కడికి వచ్చిన పక్షులు ఆహారం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లి రావాల్సి వచ్చింది.

అభివృద్ధి ఊసే లేదు..

వీరాపురాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే అతిథి పక్షుల రాక పెరుగుతుంది. ఆ దిశగా గత వైసీపీ పాలనలో దృష్టి పెట్టలేదు. కనీస చర్యలు కూడా చేపట్టలేదు. పక్షుల నివాసానికి అవసరమైన చెట్ల పెంపకంపై నేటికీ దృష్టి పెట్టలేదు. ఉన్న చెట్లను సంరక్షించే చర్యలు కూడా తీసుకోకపోవడం శోచనీయం. దీంతో గ్రామంలోని చిన్న చిన్న చెట్లపై కూడా పక్షులు గూళ్లు కట్టుకుంటున్నాయి. దాంతో బలహీనంగా ఉన్న చెట్లపై వాటికి, వాటి సంతతికి రక్షణ కరువయ్యే అవకాశం ఉంది. పక్షులను వీక్షించేందుకు గ్రామాన్ని సందర్శించే పర్యాటకులకు వసతులు కల్పించడంలో కూడా అధికారులు విఫలమయ్యారు.



వాతావరణం అనుకూలిస్తేనే..

విడిదికి అవసరమయ్యే ఆహార వనరులు, నీరు, నివాసాల ఏర్పాటుకు చెట్లతోపాటు వాతావరణం అనుకూలంగా ఉంటే ఏటా జనవరి, ఫిబ్రవరి మాసాల్లో పక్షులు ఈ గ్రామాలకు చేరుకుంటాయి. వచ్చీరాగానే చెట్లపై నివాసాలను ఏర్పాటు చేసుకుని, వాటి సంతతిని అభివృద్ధి చేసుకోవడంపై దృష్టి పెడతాయి. తిరిగి సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో సంతానంతో సహా స్వస్థలాలకు వెళ్లిపోతాయి. ఏళ్లుగా ఈ ప్రక్రియ క్రమం తప్పకుండా జరుగుతోంది. దీంతో పర్యావరణ పరిరక్షణలో భాగంగా వలస పక్షుల రక్షణకు 2011లో ఈ గ్రామాన్ని బయోలాజికల్ హెరిటేజ్ సైట్‌గా ఆంధ్రప్రదేశ్ జీవవైవిధ్య మండలి గుర్తించింది. అప్పటి నుంచి గ్రామం ప్రముఖ పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందింది.

పర్యాటకుల కోసం టవర్లు నిర్మిస్తామని చెప్పినా, ఇప్పటివరకు అమలు కాలేదు. వీరాపురం గ్రామానికి రవాణా సౌకర్యం కల్పించడంలో కూడా విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి. దీంతో పర్యాటకుల సందడి ఏటా తగ్గుతూ వస్తోంది. పర్యాటకరంగ అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టి వీరాపురం గ్రామాన్ని అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ఆటలకు విరామం.. బడికి పోదాం..



పిల్లల ముచ్చట్లు

సంక్రాంతి సెలవుల్లో పిల్లల ఆనందానికి అవధుల్లేవు. పల్లెలకు చేరుకుని, ఆనందంగా గడిపారు. తోటి పిల్లలతో ముచ్చట్లు చెప్పుకున్నారు. రకరకాల ఆటలు ఆడుతూ ఉల్లాసంగా గడిపారు. బంధువులతో కులాసాగా ఉన్నారు. వారి ఆటలకు విరామం పడింది. సోమవారం పాఠశాలలు తెరుచుకున్నాయి. దీంతో దాదాపు పదిరోజులపాటు ఆటల్లో మునిగితేలిన పిల్లలు బడిబాట బట్టారు.

-ఓబుళదేవరచెరువు(ఆంధ్రజ్యోతి)



ఓబుళదేవరచెరువు మండలం వడ్డివారిపల్లిలో చిల్లాకట్టె ఆడుతున్న విద్యార్థులు

మేము సైతం..



మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న రాష్ట్ర సేవిక సమితి మహిళలు

'దేశం కోసం మేము సైతం' అటూ మహిళలు కదంతొక్కారు. రాష్ట్ర సేవిక సమితి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో 150 మంది సేవికలు మార్చ్‌ఫాస్ట్ చేశారు. ప్రతి మహిళ దేశభక్తి కలిగి ఉండాలనీ, దేశం కోసం సేవ చేయడానికి ముందుండాలని జేష్ట సేవిక సిద్దగంగమ్మ, రాజేశ్వరి పిలుపునిచ్చారు. సమితిలో ప్రతి కుటుంబం భాగమేనన్నారు. కార్యక్రమంలో విభాగ్ వాహిక గౌరమ్మ, భౌతిక్ ప్రముఖ్ సుధా స్రమంతి, మహిళలు పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి, హిందూపురం అర్బన్



వసూళ్ల డీసీటీఓ..!

వాహనదారులతో అక్రమ వసూళ్లు
సోషల్ మీడియాలో వీడియో హల్‌చల్

7



7

యంత్రాలు.. ఎప్పుడిస్తారో..?

రాయితీ పరికరాలు, టార్పాలిన్ల కోసం నిరీక్షణ
కూటమి ప్రభుత్వంపై అన్నదాతల ఆశలు
వైసీపీ హయాంలో వీటికి మంగళం

మండ్లిపల్లిలో భారీ చోరీ

25 తులాల బంగారం..
రూ.3 లక్షల నగదు అపహరణ

7

ధర్మ పరంపరను కొనసాగించాలి

విశ్వ శాంతికి అందరూ పాటుపడాలి
శృంగేరి శారదా పీఠాధిపతి విధుశేఖర స్వామి

7

అలరించిన పద్మావతి పరిణయం





నాటికలోని సన్నివేశాలు

పుట్టపర్తి ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో ఆదివారం బాలవికాస్ విద్యార్థులు ప్రదర్శించిన పద్మావతి పరిణయం హరికథ, దృశ్యరూపకం భక్తులను అలరింపజేసింది. తిరుపతి సేవాసంస్థల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు రెండోరోజు కొనసాగాయి. బాలవికాస్ చిన్నారులు పద్మావతి పరిణయం హరికథను, కల్యాణోత్సవాన్ని కళ్లకు కట్టినట్టు నృత్యరూపకం ద్వారా ప్రదర్శించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. - ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి

వ్యవస్థలపై తిరుగుబాటు చేసిన ప్రజాకవి యోగివేమన

కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తిటౌన్, జనవరి19(ఆంధ్రజ్యోతి): మనిషి హీనస్థితికి కారణమైన వ్యవస్థలపై తిరుగుబాటు చేసిన మహనీయుడు, ప్రజాకవి యోగివేమ అని కలెక్టర్ టిఎస్ చేతన్ కొనియాడారు. ఆదివారం యోగివేమన జయంతి సందర్భంగా స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. వేమన చిత్రపటానికి పూలాలలు వేసి, నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ.. తెలుగుజాతి కీర్తిని దశదిశలా వ్యాపింపజేసిన మహాకవి వేమన అన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను పద్యరూపంలో రచించారన్నారు. విశ్వదాభిరామ వినురవేమ అనే మాట వినని తెలుగువారు లేరని గుర్తు చేశారు. వేమన పద్యాలు, లోక నీతులు సామాజిక చైతన్యాన్ని కలిస్తున్నట్లు వివరించారు. సమాజంలోని అన్ని సమస్యలనుభిన్నకోణంలో తన పద్యాల ద్వారా చెప్పారన్నారు. వేమన పద్యాల సందేశాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్వో విజయసారధి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, అన్నిశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పిస్తున్న కలెక్టర్

దిద్దుబాటు..

32 గ్రామాల ఎంపిక
నేటి నుంచి భూముల రీసర్వే

పుట్టపర్తి, జనవరి19(ఆంధ్రజ్యోతి): రైతులు, యజమానుల ప్రమేయం లేకుండా గత వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన భూముల సమగ్ర సర్వేలో లెక్కలేనన్ని తప్పులు దొర్లాయి. వీటిపై బాధితులు గగ్గోలు పెట్టారు. అధికారుల ముందు మొరపెట్టుకున్నారు. వినతులు సమర్పించారు. అయినా గత ప్రభుత్వంలో పట్టించుకున్న నాథుడు లేడు. ఇటీవల కొలువుదీరిన కూటమి ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. భూముల రీసర్వే చేయాలని నిర్ణయించింది. ఆ మేరకు సోమవారం నుంచి ప్రక్రియ చేపట్టనుంది. జిల్లాలో 32 రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేశారు.



మండలానికి ఒక గ్రామం..

జిల్లాలో 461 రెవెన్యూ గ్రామాలున్నాయి. గత వైసీపీ హయంలో 161 గ్రామాల్లో 4.03 లక్షల ఎకరాల్లో భూముల సర్వే చేపట్టారు. భూసర్వే జరిగిన చోట కుప్పలు తెప్పలుగా తప్పులు దొర్లడంతో వాటిని పరిష్కరించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే గ్రామసభల ద్వారా భూసమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. గ్రామాల సరిహద్దులు, ప్రభుత్వ భూములు గుర్తించారు. తొలుత మండలానికి ఒక గ్రామాన్ని ప్రయోగాత్మకంగా రీ సర్వే చేసేందుకు ఎంపిక చేశారు. సోమవారం నుంచి పారదర్శకంగా ప్రత్యేక బృందాలతో రీసర్వే మొదలు పెట్టనున్నారు. అక్కడ ప్రభుత్వ భూముల లెక్కలు తేల్చి ప్రైవేటు, పొలాల సర్వే చేయనున్నారు. తర్వాత మిగిలిన గ్రామాల్లో చేపట్టనున్నారు. ఈ రీసర్వే 40 రోజుల్లో పూర్తి చేయాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. గతంలో ఎదురైన సమస్యలను దృష్టిలో పెట్టుకుని అన్ని అంశాలు రైతులకు వివరించి, వారి ఆమోదంతో ముందుకెళ్లనున్నారు. ప్రతి గ్రామంలో 200 నుంచి 250 ఎకరాలను ఒక బ్లాక్‌గా విభజించి, అవసరం మేరకు నాలుగైదు సర్వే గ్రూపులు ఏర్పాటు చేస్తారు. జిల్లాలో తొలి దశలో 32 గ్రామాల్లో తప్పులు దొర్లకుండా పక్కాగా భూముల రీసర్వే చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు.

రైతుల మధ్య పంచాయితీలు

గత ప్రభుత్వంలో చేపట్టిన సర్వేలో తప్పిదాలపై వెల్లువలా ఫిర్యాదులొచ్చాయి. రైతుల మధ్య పంచాయితీలు తెచ్చి పెట్టింది. వందల ఎకరాల్లో సర్వే నంబర్లు మాయమయ్యాయి. విస్తీర్ణంలో కోత పెట్టారు. సొంత భూమి కదిలిపోవడంతో కంగారుపడిన రైతులు.. రెవెన్యూ అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేసినా ప్రయోజనం లేకపోయింది. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టింది. సర్వే పూర్తయిన గ్రామాల్లో గతనెల 25 నుంచి గ్రామ సభలు నిర్వహించారు. అందులో వచ్చిన అర్జీల పరిష్కారానికి రీసర్వే పకడ్బందీగా నిర్వహించే దిశగా ప్రత్యేక బృందాలను నియమించారు. బృందంలో ఇద్దరు గ్రామ సర్వేయర్లు, వీఆర్వో, వీఆర్‌ఏలు ఉంటారు. ఈ బృందానికి సాంకేతిక బృందం సాయంగా ఉంటుంది. పొలం గట్టు విస్తీర్ణం పక్కాగా కొలుస్తారు. గ్రామ ప్రజలు, భూయజమానుల సమక్షంలోనే రీసర్వే చేస్తారు.

రీసర్వే గ్రామాలివే..

జిల్లాలో 32 గ్రామాల్లో 1,33,732 ఎకరాల్లో రీసర్వేతో చేపట్టనున్నారు. జగరాజుపల్లి, భైరాపురం, దనంపేట, సుబ్బారావుపేట, నాగసముద్రం, మానేపల్లి, నక్కలపల్లి, జూలకుంట, సీగుపల్లి, దుద్దేబండ, రొద్దకంపల్లి, అమిదాలగొంది, వీరబొమ్మనహళ్లి, కానగమాకులపల్లి, టుబినకుంట, వడిగేపల్లి, గూనిపల్లి, డబురువారిపల్లి, కుంబరనాగేహళ్లి, అక్కగలదేవరపల్లి, ఎదురుదొన. వేలమద్ది, కుర్లి, సోమయాజులపల్లి, ఎగువపల్లి, జేకే పల్లి, కొర్తికోట, మల్లేపల్లి, ఎం అగ్రహారం, పేరూరు, కనగానపల్లి, కె పూలకుంట గ్రామాల్లో రీ సర్వే చేపట్టనున్నారు.


నెలరోజులైనా యాడికి వద్ద కాలువలో కనిపించని నీళ్లు

నీరు పారదా..?

యాడికి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): యాడికి కాలువకు నీళ్లు వదిలి నెలరోజులు అవుతున్నా ముందుకు సాగకపోవడంపై రైతుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. యాడికి కాలువ చివరిదాకా నీళ్లు పారితే భూగర్భ జలాల పెరుగుదలకు ఎంతో ఉపయోగం ఉంటుందని భావించారు. ఆ దిశగా ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి చొరవతో పెద్దవడుగూరు మండలం కదరగుట్టపల్లి వద్ద కాలువ రెగ్యులేటర్ గేట్లు



ఎత్తి యాడికి కాలువకు నీళ్లు విడుదల చేశారు. వారంరోజులు కాలువలో నీళ్లు బాగానే ముందుకు కదిలాయి. పచ్చారుమేకలపల్లి గ్రామం వరకు వచ్చిన నీళ్లు ఇక ముందుకు కదలలేదు. ఆయా గ్రామస్థులు తమ సమీపంలోని చెక్‌డ్యాంలకు నీళ్లు మళ్లించడంతో యాడికి కాలువలో నీళ్లు ముందుకు సాగడం లేదని మిగిలిన గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. కాలువలో నీటిపారకం చూడడానికి వచ్చిన అధికారులు సైతం నీళ్లు ముందుకు సాగకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. తర్వాత కొద్దిరోజులు కాలువలో నీళ్లు కొద్దిమేర ముందుకు సాగాయి. మళ్లీ షరామామూలే అన్నట్లు కాలువలో నీటి పారకం ముందుకు కదలడం లేదు. కాలువకు నీటిని వదిలి నెలరోజులకు పైగా అవుతున్నా ఇంతవరకు యాడికి వరకు రాలేదు. యాడికి నుంచి ఇంకా సగంపైగా యాడికి కాలువ ఉంది. చివరి వరకు నీళ్లు ఇంకెప్పుడు పారుతాయి అంటూ ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువ చివరి వరకు నీళ్లు పారితే భూగర్భజలాలు పెంపొందుతాయని రైతులు ఆశలు పెట్టుకున్నారు. కాలువలో నీటి ఫ్లో కొద్దిగా పెరిగేటట్లు రెగ్యులేటరీ వద్ద గేట్లు పైకి ఎత్తాలని మండల రైతులు కోరుతున్నారు.

టమోటా కిలో రూ.10



అనంతపురం రూరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.10తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు ఆదివారం 600 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.8, కనిష్ఠ ధర రూ.6 పలికినట్లు ఆయన తెలిపారు.

స్ప్రేయర్ల కోసం ఎదురుచూస్తున్నాం



పంటలకు రసాయనిక మందు పిచికారి చేసేందుకు స్ప్రేయర్లు అద్దెకు తెచ్చుకుంటున్నాం. కూటమి ప్రభుత్వంలో రాయితీ కింద అందే వ్యవసాయ పరికరాల కోసం ఎదురుచూస్తున్నాం. ప్రభుత్వం ఈ ఏడాదైనా స్ప్రేయర్లు అందించి రైతులకు సహకరించాలి. రైతుల అవసరాల మేరకు యంత్రాలను పంపిణీ చేయాలి.

-ధనుంజయ, హారేసముద్రం

యంత్రాలు.. ఎప్పుడిస్తారో..?


ధాన్యం రాశులపై కప్పిన అద్దె పట్టలు

రాయితీ పరికరాలు, టార్పాలిన్ల కోసం నిరీక్షణ

కూటమి ప్రభుత్వంపై అన్నదాతల ఆశలు

వైసీపీ హయాంలో వీటికి మంగళం

బొమ్మనహాళ్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో యంత్రాలు, పరికరాలు, సూక్ష్మ పోషకాలు కీలకం. వీటిని గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు రాయితీతో రైతులకు సరఫరా చేశారు. వైసీపీ అధికారంలో వచ్చాక ఈ రాయితీ పరికరాలన్నింటికి మంగళం పాడారు. ప్రధానంగా స్ప్రేయర్లు, కల్టివేటర్లు, ట్రాక్టర్లు సహాయకారిగా ఉంటాయి. పంటలకు నష్టం వాటిల్లకుండా మంచి దిగుబడులు వచ్చేందుకు సూక్ష్మపోషకాలు అవసరం. కల్లాల్లో పంట ఉత్పత్తుల రక్షణకు టార్పాలిన్ పట్టలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడు నెలలు దాటుతున్నా రాయితీ పరికరాలు, సూక్ష్మపోషకాలు, టార్పాలిన్ పట్టలు పంపిణీ ఊసే కనిపించలేదు. వీటి కోసం బొమ్మనహాళ్ మండలంలో రైతులు ఎదురు చూస్తున్నారు. వైసీపీ హయాంలో రైతులకు కనీసం టార్పాలిన్ పట్టలకు కూడా ఇవ్వలేదు. దీంతో వీటిని కొనుగోలు చేయడానికి రైతులకు భారమయ్యేది.

యంత్ర పరికరాలేవీ..?

పంట సాగుకు యంత్రపరికరాలు ఎంతో అవసరం. ఇవి లేనిదే వ్యవసాయ పనులు ముందుకు సాగే పరిస్థితి లేదు. గత ఐదేళ్లు రాయితీ యంత్రపరికరాలు పంపిణీ జరగలేదు. పంటలకు ఆశించే తెగుళ్ల నివారణకు మందు పిచికారి చేయాలంటే స్ప్రేయర్లు తప్పనిసరి. గ్రామాల్లో స్ప్రేయర్ల కొరతను రైతులు ఎదుర్కొంటున్నారు. అరకొర స్ప్రేయర్లతో మందులు పిచికారి చేస్తున్నారు. దీనివల్ల పిచికారిలో జాప్యం జరిగి పంటలు దెబ్బతింటున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పెద్దఎత్తున తైవాన్ స్ప్రేయర్లు పంపిణీ చేశారు. వాటిలో ఉన్న కొన్ని స్ప్రేయర్లతోనే రైతులు ఇప్పటికీ నెట్టుకువస్తున్నారు. రాయితీ స్ప్రేయర్ల కోసం వ్యవసాయ కార్యాలయాల చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేస్తున్నారు. బ్యాటరీ స్ప్రేయర్లు, కల్టివేటర్లు, పవర్‌వీడర్, పవర్ స్ప్రేయర్లు ట్రాక్టర్లు ఇలా 19 రకాల యంత్రపరికరాలను రాయితీపై పంపిణీ చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు ప్రభుత్వం వాటి ఊసెత్తకపోవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఖరీఫ్‌లో పంట చేతికి వచ్చిన సమయంలో అధిక వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం కుప్పలు తడవకుండా కాపాడుకోవడానికి పడరాని పాట్లు పడ్డారు. టార్పాలిన్లు అద్దెకు తెచ్చుకుని పంటలను కాపాడుకున్నారు. కల్లాల్లో ఉన్న మిరప తడిసి రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతుల వద్ద పట్టలు లేక అద్దెకు దొరక్క వరి ధాన్యం, మిరప, మొక్కజొన్న వంటి పంటలను కాపాడుకోలేక నష్టాలను చవిచూశారు.

సూక్ష్మ పోషకాల ఊసే లేదు

సూక్ష్మ పోషకాలలోపంతో పంటలకు నష్టం వాటిల్లుతోంది. జింక్, బోరాన్, మెగ్నీషియం, పొటాషియం వంటి సూక్ష్మ పోషకాలు పంటలకు అవసరం. గతంలో టీడీపీ ప్రభుత్వం ఆయా సూక్ష్మ పోషకాలను రాయితీపై రైతులకు అందించింది. ఖరీఫ్ ముగిసి రబీ సీజన్ వచ్చినా నేటికీ వాటి ఊసేలేదు. సూక్ష్మపోషకాల వల్ల కలుగుతున్న పంటల నష్టాన్ని నివారించుకోవడానికి రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. వీటి ధరలు మార్కెట్‌లో అధికంగా ఉండటంతో రైతులపై ఆర్థిక భారం పడుతోంది. పంటలకు తక్షణ అవసరంగా ఉన్న సూక్ష్మ పోషకాలను రాయితీపై అందించాలని రైతులు కోరుతున్నారు.

టార్పాలిన్లు పంపిణీ చేయాలి



వరి ధాన్యం ఆరబెట్టేందుకు నానా తంటాలు పడ్డాం. గత వైసీపీ ప్రభుత్వం రైతులకు టార్పాలిన్ పట్టలు పంపిణీ చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇప్పుడైనా రైతులకు పట్టలు పంపిణీ చేయాలి. ధాన్యం కప్పేందుకు టార్పాలిన్లను అద్దెకు తెచ్చుకున్నాం. అద్దె భారమయింది. రూ.2 వేల వరకు ఖర్చయింది. ఒక టార్పాలిన్‌కు రోజుకు రూ.20 నుంచి రూ.30 వరకు అద్దెలు వసూలు చేశారు.

-ఎర్రిస్వామి, శ్రీధరఘట్ట

స్వర్ణాంధ్రప్రదేశ్‌కి స్వామి ఆశీస్సులు : మంత్రి సవిత


ఆలయం ముందు మంత్రి సవిత

తిరుమల, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఏపీ స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారడానికి శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు తప్పకుండా ఉంటాయని ఆశిస్తున్నట్టు రాష్ట్ర మంత్రి సవిత తెలిపారు. తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. వైకుంఠద్వార దర్శనాల చివరిరోజు శ్రీవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. తాను చాలా మంది భక్తులతో స్వయంగా మాట్లాడానని, దర్శనం, ప్రసాదాలు, వసతులు, ఇతర ఏర్పాట్లు చాలా బాగున్నాయని సంతృప్తి వ్యక్తంచేసినట్టు మంత్రి చెప్పారు.

22న డాకు మహారాజ్ విజయోత్సవ సభ

ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్


మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కథానాయకుడు నందమూరి బాలకృష్ణ నటించిన డాకు మహారాజ్ సినిమా విజయోత్సవ సభ ఈనెల 22న అనంతపురంలో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక శ్రీనగర్ కాలనీలోని అయ్యప్పస్వామి ఆలయ సమీపంలో విజయోత్సవ సభను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాలకృష్ణ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు గౌస్‌మొద్దీన్, ఎన్‌బీకే హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు జగన్, నగర అధ్యక్షుడు శ్రీధర్‌లతో కలిసి ఆదివారం ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించాలని ఏర్పాట్లు చేసినప్పటికీ తిరుపతి ఘటన నేపథ్యంలో రద్దు చేశామని వెల్లడించారు. అందుకే విజయోత్సవ సభను 25వేల మందితో నిర్వహిస్తున్నామన్నారు. అభిమానులు సంయమనం పాటించి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. గౌస్‌మొద్దీన్ మాట్లాడుతూ అనంతపురంలో విజయోత్సవం నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. జగన్ మాట్లాడుతూ... రాయలసీమపై ప్రత్యేక అభిమానంతో అనంతపురంలోనే ఈవెంట్ నిర్వహించాని బాలకృష్ణ నిర్ణయించారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముంటిమడుగు కేశవరెడ్డి, రామలింగారెడ్డి, గంగారామ్, సుధాకర్ యాదవ్, పోతుల లక్ష్మీనరసింహులు, గోళ్ల సుధాకర్ నాయుడు, ముక్తియార్, సైఫుద్దీన్, లక్ష్మీనరసింహ, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కవిత్వ విమర్శ.. ఒక ఆత్మకథ

సాహితీ విమర్శకుడు గుంటూరు లక్ష్మీనరసయ్య


పూల మీద వాలిన తేనెటీగ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీకారులు

అనంతపురం కల్చరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రతి కవిత్వ విమర్శ ఒక ఆత్మకథ అని సీనియర్ సాహితీ విమర్శకుడు గుంటూరు లక్ష్మీనరసయ్య పేర్కొన్నారు. సాహితీవేత్త తూముచెర్ల రాజారామ్ రచించిన 'పూల మీద వాలిన తేనెటీగ' కవిత్వ విమర్శ వ్యాస సంపుటి పుస్తకావిష్కరణ సభను స్పందన అనంత కవుల వేదిక, హైదరాబాద్‌కు చెందిన కవి సంగమం సాహితీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. గుంటూరు లక్ష్మీనరసయ్యతోపాటు కవిసంగమం సారథి కవి యాకూబ్ హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సృజనాత్మకత నుంచి సాంకేతికతవైపు నడుస్తున్న కాలంలో పూర్వ విమర్శకులను గౌరవిస్తూ కవిత్వ విమర్శ రాస్తున్న రాజారామ్ భవిష్యత్‌లో మరిన్ని విమర్శనా గ్రంథాలు రాయాలని ఆకాంక్షించారు. కొత్త కవులు, విమర్శకులకు మార్గనిర్దేశం చేస్తూ చదవాలనే ఆసక్తిని కలిగించేలా ఆయన విమర్శ వ్యాసాలు ఉంటాయని అభిప్రాయపడ్డారు. స్పందన అనంత కవుల వేదిక ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరశాస్త్రి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీనియర్ సాహితీవేత్తలు డాక్టర్ శాంతినారాయణ, అంకె శ్రీనివాస్, విశ్వనాథరెడ్డి, నాగేంద్ర, ఈరన్న, యాములపల్లి నర్సిరెడ్డి, తరిమెల అమరనాథరెడ్డి, చెట్ల ఈరన్న, జెట్టి జైరాం, సతీష్‌చంద్ర, అక్బర్, డాక్టర్ ప్రగతి పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

ఆత్మకూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృత అభిషేకం, అలంకరణ, ఆకుపూజ, అర్చనలు చేశారు. కుజదోష, సర్పదోష నివారణకు సుబ్రహ్మణ్యేశ్వర మూల మంత్ర హోమం నిర్వహించారు. అన్నదాన కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బాబు, ప్రధాన అర్చకులు రాముస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

మండ్లిపల్లిలో భారీ చోరీ

25 తులాల బంగారం.. రూ.3 లక్షల నగదు అపహరణ

తనకల్లు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మండ్లిపల్లిలో భారీ చోరీ జరిగింది. ఇందుకు సంబంధించిన ఎస్ఐ గోపి ఆదివారం తెలిపిన మేరకు.. మండ్లిపల్లికి చెందిన మల్లికార్జునరెడ్డి ఈనెల 16న రాత్రి కుటుంబ సభ్యులతో శ్రీశైలం దైవదర్శనానికి వెళ్లారు. 18వతేదీ రాత్రి పొద్దుపోయిన తరువాత ఇంటికి చేరుకున్నారు. ఇంటి తాళాలు పగలకొట్టిఉండడంతో లోపలికెళ్లి పరిశీలించారు. ఇంటిలో ఉన్న బీరువాలను పగులకొట్టి దొంగలు తమ కుమారులు, కోడళ్లు బీరువాల్లో దాచుకున్న 25 తులాల బంగారం, 26 తులాల వెండి, రూ. 3 లక్షల నగదు చోరీ చేసినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఆదివారం ఉదయమే అనంతపురం నుంచి పోలీసు జాగిలాలను రప్పించి పరిశీలించారు. అనంతరం క్లూస్ టీమ్ కూడా వచ్చి చోరీ జరిగిన ఇంటిలోని వస్తువులు, బీరువాలు, మంచాలను, క్షుణంగా పరిశీలించింది. కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి, రూరల్ సీఐ నాగేంద్ర, ఎస్ఐ గోపి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మల్లికార్జునరెడ్డి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇళ్లకు తాళాలు వేస్తే.. సమాచారం ఇవ్వండి: సీఐ

ఎవరైనా ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్తున్నప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కదిరి రూరల్ సీఐ నాగేంద్ర తెలిపారు. విలువైన బంగారం, వెండి, నగదు ఇళ్లలో ఉంచుకోకూడదని, బ్యాంక్‌లాకర్లలో దాచుకోవాలని సూచించారు. ఇళ్లవద్ద అవసరమైతే సీసీ కేమెరాలను కూడా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేటప్పుడు బంధువులు, స్నేహితులు, చుట్టుపక్కల ఇళ్లవారిని అప్రమత్తం చేయాలన్నారు.

మర్తాడులో...

గార్లదిన్నె, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మర్తాడు గ్రామంలోని ఓ ఇంట్లో దొంగలు చొరబడి తులం బంగారం, 11 తులాలు వెండి అభరణాలు చోరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. మర్తాడులో హాజీబాషా, షకీలా దంపతులు గ్రామంలో కూలీ పనులతో జీవనం సాగించేవారు. అనంతపురంలో షకీల తమ్ముడి నిశ్చితార్థం ఉండడంతో ఈనెల 11న వెళ్లారు. ఆదివారం తిరిగి మర్తాడుకు వచ్చారు. ఇంటి తాళం పగలకొట్టి బీరువాలోని 11 తులాల వెండి అభరణాలు, తులం బంగారు ఆభరణాలు, రూ.30వేల నగదును దుండగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా, జమేదార్ గురుమూర్తి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తల్లిమడుగుల పెద్దమ్మ ఆలయంలో..

కనగానపల్లి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని తల్లిమడుగుల గ్రామం పెద్దమ్మ ఆలయంలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. ఆదివారం ఉదయం పెద్దమ్మ ఆలయానికి పూజ చేసేందుకు వెళ్లిన పూజారి అమ్మవారికి అలంకరించిన వెండి అభరణాలు లేకపోవడాన్ని గుర్తించారు. విషయాన్ని గ్రామస్థులకు తెలిపారు. ఈ మేరకు కనగానపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన అభరణాల విలువ దాదాపు రూ.2లక్షల వరకు ఉంటుందని గ్రామస్థులు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.

ఏఆర్ ఎస్ఐపై చర్యలు తీసుకోండి

కొడుకుపై దాడి చేశాడని మహిళ ఫిర్యాదు


పోలీస్‌స్టేషన్‌లో బాధిత మహిళ, ఆమె కుమారుడు

అనంతపురం క్రైం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): తనను రెండో పెళ్లి చేసుకున్న ఏఆర్ ఎస్ఐ చంద్రశేఖర్ తన కొడుకుపై చేయి చేసుకున్నాడని ఓ మహిళ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆదివారం రాత్రి అంజలి త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చింది. 14వ బెటాలియన్‌లో పనిచేస్తున్న ఏఆర్ ఎస్ఐ చంద్రశేఖర్ తనను రెండో పెళ్లి చేసుకున్నాడని, గత కొంతకాలంగా దూరం పెడుతున్నాడని తెలిపింది. విజయవాడలో చదువుతున్న కొడుకు స్కూల్ ఫీజు కడతానని చెప్పి సాయంత్రం ఇంటికి పిలిపించుకున్నాడని, అక్కడికి వెళితే మరో వ్యక్తితో కలిసి దాడి చేశారని ఆరోపించింది. త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు సమాచారం. ఈ ఘటనపై త్రీటౌన్ సీఐ శాంతిలాల్‌ను వివరణ కోరగా...ఆమె ఏఆర్ ఎస్ఐ తన కొడుకుపై దాడి చేశారని చెప్పారని, కానీ ఫిర్యాదు ఇవ్వడం లేదన్నారు. శాశ్వత పరిష్కారం కావాలని కోరుతున్నారని వివరించారు.

వసూళ్ల డీసీటీఓ..!

వాహనదారులతో అక్రమ వసూళ్లు

సోషల్ మీడియాలో వీడియో హల్‌చల్


నల్లబండల వాహనదారులతో వాగ్వాదం చేస్తున్న డీసీటీఓ, ఆయన కుమారుడు

అనంతపురం క్రైం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): వచ్చే జీతం చాలదనో లేక మరో రెండు నెలల్లో రిటైర్డ్ అవుతాననో వాణిజ్య పన్నుల శాఖలో ఓ డీసీటీఓ వసూళ్లకు తెగబడ్డాడు. ఇటీవల మద్యం మత్తులో ఆయన నల్లబండలు తరలిస్తున్న వాహనాలను ఆపి, డబ్బు డిమాండ్ చేయడం, వారు ప్రశ్నించడం మొత్తం వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. పై అధికారుల వద్ద అతివినయం నటిస్తూ, హైవేపై వసూళ్లకు తెగబడే డీసీటీఓ సుబ్బరాయుడి బాగోతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. నిత్యం హైవేలలో తనిఖీల పేరుతో వాహనాలను ఆపి వసూలు చేస్తుంటారు. ఈ సారి ఏకంగా తన కుమారుడిని వెంటపెట్టుకుని వెళ్లి మరీ వసూలు చేశారు. తాత్కాలిక నెంబరుతో ఉన్న కొత్త కారులో ఈ వసూళ్ల వ్యాపారం పెట్టారు. మూడు రోజుల కిందట రాత్రి సమయంలో నల్లబండలు తరలిస్తున్న వాహనాలను అడ్డుకుని వసూళ్లకు తెరలేపారు. వారు తీసిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. సుబ్బరాయుడు ప్రస్తుతం అనంతపురం సర్కిల్-2లో డీసీటీఓగా పనిచేస్తున్నారు. ఈయన మీద అనేక ఆరోపణలున్నాయి. తరచూ ఇలా హైవేలలో వెళ్లి వాహనదారుల నుంచి తాను సేల్స్ టాక్స్ ఆఫీసర్‌నంటూ వసూలు చేస్తుంటారని సమాచారం. అది రాత్రా, పగలా అన్నది చూసుకోరట. వాస్తవానికి లారీ చెక్ పేరుతో కొన్ని సందర్భాల్లోనే ఉన్నతాధికారులు చర్యలకు ఆదేశిస్తుంటారు. అలాంటి సమయాల్లోనే వాహనాలను తనిఖీ చేయాలి. కానీ ఈయన తరచూ అదే వ్యవహారం చేస్తుంటారు. ఈయన ప్రస్తుతం కర్నూలులో ఉంటుండటంతో ప్రయాణ సమయాల్లో వచ్చేటప్పుడు, పోయేటప్పుడు వసూళ్ల దందాకు తెరలేపుతుంటారట. నల్లబండల తరలిస్తున్న వాహనదారులను ప్రశ్నించి డబ్బు డిమాండ్ చేయడంతో వారు మీరు ఎవరని..? ఫలానా శాఖలో ఏ కేడర్‌లో పనిచేస్తారని..? మీరు మద్యం తాగారని హిందీలో ప్రశ్నిస్తున్న వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది. ఈ విషయంపై ఆ శాఖ ఉన్నతాధికారులు అతడికి మెమో జారీ చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. ప్రాథమిక విచారణ చేస్తున్నట్లు సీటీఓ-2 నరసింహులు తెలిపారు. కాగా, ఆ వీడియో డోన్ సమీపంలోని టోల్‌గేట్ అని చెబుతుండగా కాదు గుత్తి టోల్‌గేట్ అంటూ సంబంధిత అధికారి చెప్పుకొచ్చినట్లు సమాచారం.

ధర్మ పరంపరను కొనసాగించాలి

విశ్వ శాంతికి అందరూ పాటుపడాలి

శృంగేరి శారదా పీఠాధిపతి విదుశేఖర స్వామి


కుంభాభిషేకం చేస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): హైందవ సంస్కృతి సంప్రదాయాలు, ధర్మపరంపరను అందరూ కొనసాగించాలని శృంగేరి శారదాపీఠం పీఠాధిపతి విదుశేఖర స్వామి పేర్కొన్నారు. ఆదివారం హిందూపురంలోని శ్రీకంఠపురం, పులమతిరోడ్డులో నిర్మించిన రాజరాజేశ్వరీ అమ్మవారి ఆలయంలో కుంభాభిషేకం, పునఃప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. అమ్మవారి మూలవిరాట్ పునఃప్రాణప్రతిష్ఠ, వివిధ అభిషేకాలు, అలంకారసేవలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ విమాన గోపురంపై కళశస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మ అనుగ్రహంతోనే ఆలయ నిర్మాణం జరిగిందన్నారు. అందుకు ఆలయ ధర్మకర్త కిషోర్‌స్వామి, ఆయన కుమారుడు హర్షవర్ధన్, పుర ప్రజల సహకారం ఎంతో ఉందన్నారు. హైందవ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి హిందువు కొనసాగించాలని తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. అనంతరం బ్రాహ్మణ సంఘం, కోట శంకరమఠంలోని వివిధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు.

జుత్తు కత్తిరింపు కేసులో 11 మంది అరెస్ట్

నిందితులకు 14 రోజుల రిమాండ్.. మరో 9 మంది కోసం గాలింపు

పెనుకొండ రూరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మునిమడుగు గ్రామంలో ఓ మహిళకు జుత్తు కత్తిరించిన కేసులో 11 మందిని శనివారం అరెస్ట్ చేశామని డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రాఘవన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం నిందితులను పెనుకొండ ఫస్ట్‌క్లాస్ అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి ముజీబ్ ఎదుట హాజరు పరచగా 14 రోజుల రిమాండు విధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని మునిమడుగు గ్రామంలో ఓ మహిళను జుత్తు కత్తిరించిన కేసులో 20మందిపై కేసు నమోదు చేశామని తెలిపారు. ఐదురోజుల క్రితం మునిమడుగు గ్రామంలో ప్రేమ జంటకు సహకరించిందని గ్రామానికి చెందిన మహిళను అమ్మాయి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు జుత్తును కత్తిరించి వివస్త్రను చేసి చిత్రహింసలు చేశారని వివరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు 20మందిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. 11 మంది నిందితులను అరెస్టు చేసి, న్యాయాధికారి ముందు హాజరు పరచగా 14 రోజులు రిమాండు విధించినట్లు తెలిపారు. వీరిని రెడ్డిపల్లి సబ్‌జైలుకు తరలించారమని చెప్పారు. అరెస్టు చేసిన నిందితుల్లో నలుగురు పురుషులు, ఏడుగురు మహిళలు ఉన్నారని, మిగిలిన తొమ్మిది మంది కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు డీఎస్పీ, సీఐ తెలిపారు. మిగిలిన తొమ్మిది మంది నిందితులను కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు.

బాబోయ్ దోమలు..!



గత వైసీపీ ప్రభుత్వం పరిసరాల పరిశుభ్రత గురించి ఏ మాత్రం పట్టించుకోలేదు. తమ ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ ఉంటోందని, చెత్తను తొలగించాలని ప్రజలు వేడుకున్నా.. వైసీపీ పాలకులు, అధికారులు ఏ మాత్రం పట్టించుకోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం స్వచ్ఛత, పరిసరాల పరిశుభ్రత కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నా.. అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో అపరిశుభ్రత వల్ల దోమలు విపరీతంగా పెరిగి.. ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

ప్రధాన రోడ్డుపై నిలువ ఉన్న మురుగు

- అపరిశుభ్రతతో పెరుగుతున్న కీటకాలు
- అధికారుల పర్యవేక్షణలోపం
- 'స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్'పై నిర్లక్ష్యం
- ఏళ్లు గడిచినా కానరాని ఫాగింగ్

ఓబుళదేవరచెరువు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం, మండలంలోని గ్రామీణులను ప్రస్తుతం దోమల బెడద పట్టిపీడిస్తోంది. ప్రస్తుత కూటమి ప్ర భుత్వం స్వచ్ఛత కోసం పలు కార్యక్రమాలు చేస్తున్నా, అధికారుల నిర్లక్ష్యం అవి నీరుగారిపోతున్నాయి. ప్రతి శుక్రవారం డ్రైడే, ఫ్రైడే పెట్టినా అవి తూతూ మం త్రంగా నిర్వహిస్తున్నారు. మండల కేంద్రంలోని కదిరి -హిందూపురం ప్రధాన రోడ్డుపై మురుగునీరు అనేక నెలలుగా ప్రవహిస్తోంది. మురుగు నిలువ ఉన్నా అధి కారులు నిరవారణ చర్యలు చేపట్టలేదు. మురుగునీరు నిలువతో దోమలు వృద్ధి చెంది.. ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు.

● ఏళ్లుగా కానరాని ఫాగింగ్

పారిశుధ్యం లోపించి దోమలు పెరిగిపోతున్నా.. సం బంధిత అధికారులు, పంచాయతీ పాలకులు ఫాగింగ్ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఐదేళ్ల క్రితం ఫా గింగ్ చేశారు. ఆ తరువాత అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వ పాలనలో ఏమాత్రం ఫాగింగ్ చేసిన దాఖ లాలు లేవు. వీటికితోడు శాశ్వత గ్రామ కార్యదర్శి లేకపోవడం, ఇన్‌చార్జీలుండడంతో వీటిపై దృష్టి సారించలేదు. వైసీపీ పాలనలో పంచాయతీలకు నిధులు కేటాయించకపోవడంతో ఫాగింగ్ చేయలేకపోయినట్లు తెలుస్తోంది.

● డ్రైడే, ఫ్రైడే ఏదీ

ప్రతి శుక్రవారం డ్రైడే, ఫ్రైడే నిర్వహించాల్సి ఉంది. ఈ కార్యక్రమంలో భాగంగా వైద్యసిబ్బంది, ఆయా ప్రాం తాలకు వెళ్లి మురుగునీరు నిలువ ఉన్న ప్రాంతాల్లో దోమల నివారణకు చర్యలు చేపట్టాల్సి ఉంది. వీటికితోడు పరిసర ప్రాంతాల్లో నీటి తొట్టిల్లో దీర్ఘకాలికంగా నీరు నిలువ లేకుండా, ల్వారాలు ఉత్పత్తికా కుండా చూడాల్సి ఉంది. అయితే ప్రస్తుతం డ్రైడే, ఫ్రైడే కార్యక్రమాన్ని అధికారులు చేపట్టకపోవడంతో దోమల సంతతి విపరీతంగా పెరిగింది.

● అమలు కాని 'స్వచ్ఛాంధ్ర'

కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన స్వ చ్ఛాంధ్రా, స్వచ్ఛదివస్ కార్యక్రమాలను అధికారులు సక్రమంగా నిర్వహించడం లేదు. సీఎం నారా చంద్ర బాబునాయుడు ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛాంధ్రా స్వచ్ఛ దివస్ కార్యక్రమం చేపట్టాలని సూచిం చారు. అయితే ప్రారంభంలో మాత్రం అధికారులు కేవ లం ఫొటోలకు ఫోజులిచ్చారే తప్పా.. ఆ తర్వాత ఆచరణ చేయలేదు.

● రోడ్డు మధ్యలోనే

ప్రధానంగా స్థానిక బీసీ కాలనీలో మెయిన్ వీధిలో మురుగునీటి కాలువ సౌకర్యం లేకపోవడంతో ఇళ్లు, హోటల్ మురుగునీరు రోడ్డు మధ్యలోనే పారుతోంది. అనేక మంది వృద్ధులు, చిన్నారులు మురుగునీరు పేరుకుపోవడంతో కాలు జారి పడ్డారు. కూటమి ప్రభుత్వం అయినా మురుగునీటి కాలువలు ఏర్పాటు చేయాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.



బీసీ కాలనీలో వీధి మధ్యలో పారుతున్న మురుగునీరు



దుర్వాసనతో ఇబ్బంది

ఓడీసీలోని బీసీ కాలనీలో మురుగునీటి కాలువలు లేవు. దీంతో తీవ్ర దుర్వాసన వస్తోంది. మురుగునీరు రోడ్డు మధ్య నుంచే వెళ్తోంది. అనేక మంది జారి పడి గాయపడ్డారు. మురుగునీటి వద్ద దోమలు పెరిగి అందరం రోగాల బారిన పడుతున్నాం. మురుగు కాలువ ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- ఆకుతోట రామచంద్ర, బీసీ కాలనీ



ఫాగింగ్ ఊసే లేదు

దోమల నివారణ కోసం ఐదేళ్ల క్రితం ఫాగింగ్ చేశారు. ఆ తర్వాత దాని ఊసే లేదు. కొన్నేళ్లుగా ఫాగింగ్ చేయడంలేదు. పగలే దోమలు దాడులు చేస్తున్నాయి. అనేక సార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పుడు అనేకమంది రోగాల బారిన పడ్డారు. మళ్లీ ఫాగింగ్ చేసేలా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలి.

- మహమ్మద్‌అలీ, ఓడీచెరువు



జారి పడతాం

వీధుల్లోనే మురుగునీరు పారుతోంది. నెలలుగా ఇలా పారడం వల్ల పాచిపట్టి.. దుర్వాసన వస్తోంది. అంతేకాకుండా.. పొరపాటున ఆ పాచి మీద కాలేస్తే.. జారి పడాల్సిందే. అలా చాలా మంది వృద్ధులు జారిపడి గాయపడ్డారు. వీధుల్లోకి రావాలంటేనే భయంగా ఉంది. మరో వైపు దోమలూ విపరీతంగా పెరిగాయి.

- నీరుగుట్టు నారాయణమ్మ, ఓడీచెరువు

న్యూస్ బాక్స్

ఘనంగా వైట్‌ఫీల్డ్ ఆస్పత్రి వార్షికోత్సవం



గీతాలు ఆలపిస్తున్న వైద్యసిబ్బంది

పుట్టపర్తి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి సూపర్ ఆస్పత్రి బెంగుళూరు 24వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం సాయికుల్వంతు సభామండపంలో వైట్‌ఫీల్డ్ ఆస్పత్రి సిబ్బంది సత్యసాయి మహాసమాధికి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఆస్పత్రి సేవల గురించి సిబ్బంది వివరించారు. సత్యసాయి ప్రేమతత్వంపై భక్తిగీతాలు ఆలపించారు. అనంతరం మహాసమాధిని దర్శించుకున్నారు.

వైభవంగా గోదాకల్యాణం



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

ధర్మవరం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక పాండురంగస్వామి ఆలయంలో ఆదివారం గోదాదేవి కల్యాణోత్సవాన్ని అర్చకులు కన్నుల పండువగా నిర్వహించారు. పాండురంగస్వామికి వివిధ రకాల పూలతో, పట్టువస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం మహామంగహారతి, తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కల్యాణోత్సవం ఆల య కమిటీ ఆధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేటి నుంచి పశువైద్య శిబిరాలు

బత్తలపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 20 నుంచి 31 వరకు పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఏడీ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. పశువులు, గొర్రెలు, మేకలకు వైద్యం అందించడానికి రెండు బృందాలుగా ఏర్పడి.. గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహిస్తామన్నారు. 20న బత్తలపల్లి, ముస్తూరు, 21న గంటాపురం, సంజీవపురం, 22న పోట్లమర్రి, మాల్యవంతం, 23న వెల్పుమడుగు, తంబాపురం, 24న వెంకటగారిపల్లి, అప్రాచెరువు, 25న ఇందిరమ్మకాలని, 26న లింగారెడ్డిపల్లి, సంగాల, 27న రాఘవంపల్లి, ఓబుళాపురం, 28న యర్రయపల్లి, గరశనపల్లి, 29న ఎం. చెర్లోపల్లి, దంపెట్ల, 30న అనంతసాగరం, డి.చెర్లోపల్లి, 31న గుమ్మల కుంట, నల్లబోయినపల్లి గ్రామాల్లో పశు వైద్యశిబిరాలు నిర్వహిస్తామన్నారు.

● గాండ్లపెంట: మండలంలోని వివిధ గ్రామాల్లో పశువులకు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు పశువైద్యాధికారి చెన్నకేశవులనాయక్ ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఈనెల చివరి వరకు ఆయా పంచాయతీల్లో నిర్వహిస్తామన్నారు.

● తనకల్లు : మండలంలోని బాలసముద్రం, దిగువతొట్లిపల్లి పంచాయతీల్లో సోమవారం పశువైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు పశువైద్యాధికారి హరినాథ్‌రెడ్డి తెలిపారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలో ఉచిత వైద్యశిబిరాలు ఈనెల 31 వరకు వివిధగ్రామాల్లో నిర్వహిస్తామన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం : టీడీపీ



పరిటాల శ్రీరామ్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

తాడిమర్రి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తిష్ట వేసిన సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ స్పష్టం చేశారు. మండలంలోని చిల్లవారిపల్లి గ్రామంలో ఆయన ఆదివారం పర్యటించారు. ఆయనకు గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలోని సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి ఆరా తీశారు. ఆయన వెంట టీడీపీ మండల కన్వీనర్ కూచిరాము, నాయకులు శివశంకర్, రాజశేఖర్ ఉన్నారు.

వణికించిన చలి



పంటను కమ్మేసిన పొగమంచు

ఓబుళదేవరచెరువు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం తెల్లవారుజామున నుంచి సాయంత్రం వరకు చలి తీవ్రంగా ఉంది. ఉదయం ఏడు గంటలైనా పొగమంచు వీడలేదు. పొలాలపై పొగమంచు కమ్ముకుంది. చలి ఎక్కువగా ఉండడతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వృద్ధులు, చిన్నారులు ఇళ్లలో నుంచి బయటకు రాలేదు.

బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందజేత

ధర్మవరం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆరునెలల కాలంలో వివిధ కారణాల వల్ల కాంట్రాక్టు కింద పని చేస్తున్న నలుగురు పారిశుధ్య కార్మికులు మరణించారు. మృతుల కుటుంబాలకు రావాల్సిన మట్టి ఖర్చులు, ఎక్స్‌గ్రేషియా తదితర డబ్బులు మంజూరయ్యాయి. ఆ చెక్కులను మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ బాధిత కుటుంబాలకు ఆదివారం తన చాంబర్‌లో ఆదివారం అందజేశారు. ఇందులో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యామ్సన్, మున్సిపల్ పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు బాబు, ముకుంద, లక్ష్మీఓబిలేసు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న కమిషనర్ ప్రమోద్‌కుమార్

ముగిసిన క్రికెట్ టోర్నీ

విజేతగా నిలిచిన నల్లమాడ జట్టు



విజేత జట్టుకు నగదు అందజేస్తున్న మాజీ మంత్రి

నల్లమాడ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): నల్లమా డలో వారం నుంచి నిర్వహించిన క్రికెట్ టోర్నమెంటు ఆదివారంతో ముగిసింది. ఈ టోర్నమెంటులో మొత్తం 36 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో కొత్తచెరువు, నల్లమాడ జట్లు తలపడగా, నల్లమాడ జట్టు విజేతగా నిలిచింది. దీంతో నల్లమాడ జట్టుకు రూ.20,116, కొత్త చెరువు జట్టుకు రూ. 10,116 నగదు, ట్రోఫీలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆయా జట్లకు వాటిని అందజేశారు. అలాగే ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు మెడల్స్, ప్రోత్సహక బహుమతులు అందించారు. ఆయన మాట్లాడుతూ చదవుతో పాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలని సూచించారు. టోర్నమెంటు నిర్వాహకుడు మంజునాథ్ రెడ్డిని మాజీమంత్రి సన్మానించారు. కార్యక్రమంలో సీఐ నరేంద్రరెడ్డి, టీడీపీ కన్వీనర్ షైలే శివశంకర్, మాజీ కన్వీనర్ కేశవరెడ్డి, సలాం ఖాన్, గనిరెడ్డి, బుట్టి నాగభూషణనాయుడు, రసీద్‌ఖాన్, అబ్బాస్‌ఖాన్, చంద్రశేఖ రరెడ్డి, మంజునాథ్‌రెడ్డి, వెంకటరమణనాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గాండ్లపెంట : వేమన విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా యోగి వేమన జయంతి

గాండ్లపెంట, జనవరి 19(ఆంధ్రజ్యోతి): శ్రీయోగివేమన జయంతి వేడుకలు మండలంలోని కటారుపల్లిలో విశ్వ వేమన కొండ వద్ద, ఆలయం వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. విశ్వవేమన కొండ వద్ద వేమన విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అలాగే సమాధిని పలువురు భక్తులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ప్రభుత్వం ఎంతో ఘనంగా నిర్వహించాల్సిన వేమన జయంతిని ఎలాంటి సంస్కృతిక కార్యక్రమాలు, హంగు, ఆర్భాటాలు లేకుండా నిర్వహించడంపై భక్తులు, తెలుగు బాషాభిమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి, ఈఓఆర్డీ, పంచాయతీ కార్యదర్శులు, దాసిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

● ధర్మవరం : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు యోగివేమన జయంతి వేడుకలను ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ మహేశ్, ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ అబ్దుల్‌నబీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. యోగివేమన చిత్రపటానికి పూలమాలలు వేసినివాళులర్పించారు.

● బత్తలపల్లి : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం యోగి వేమన జయంతిని అధికారులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి శ్రీనివాసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన ఇజ్‌తెమా



బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న పుట్టపర్తి డీఎస్పీ

తాడిమర్రి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ముస్లింల ఇజ్‌తెమా కార్యక్రమం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. పలువురు మత పెద్దలు ఇందులో ప్రార్థనలు చేయడంతోపాటు అల్లాబోధనలు వివరించారు. సోమవారం కూడా నిర్వహించే ఈ కార్యక్రమానికి ధర్మవరం, కదిరి ప్రాంతాల నుంచి దాదాపు 50వేల మంది ముస్లింలు హాజరయ్యే అవకాశముంది. దీంతో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రార్థనలు ప్రశాంతంగా జరిగేలా పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేశారు. డ్రోన్ కెమెరాలతో పోలీసు జాగిలాలతో సభా ప్రాంగణాన్ని తనిఖీ చేస్తున్నారు. సీఐలు శ్యామరావు, శ్రీధర్, ఎస్‌ఐ కృష్ణవేణి పలువురు ఎస్‌ఐలు, 200 మంది పోలీసులు బందోబస్తు పర్యవేక్షిస్తున్నారు.

నేడు సోమయాజులపల్లిలో భూముల రీసర్వే

గాండ్లపెంట, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమయా జుపల్లిలో సోమవారం భూముల రీసర్వే నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బాబురావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమయాజుపల్లి రెవెన్యూ గ్రామంలోని భూముల రైతులు ఉదయం 9గంటలకు రీసర్వే కార్యక్రమానికి హాజరుకావాలన్నారు. రైతులు భూ సమస్యలను తమ దృష్టికి తీసుకొని వస్తే.. వాటిని పరిష్కరిస్తామన్నారు. భూకొలతలు, హద్దులను చూపించి, భూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి

ధర్మవరం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): డాక్టర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రహోం మంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని సీపీఐ, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక కళాజ్యోతి సర్కిల్‌లో వారు అమిత్‌షా గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏపీ చేనేత కార్మికసంఘం జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ, సీపీఎం జిల్లా నాయకులు ఎస్‌హెచ్ బాషా, సీటీఈయూ మండల కన్వీనర్ జేవీ రమణ, సీపీఐ నాయకులు రమణ, చేనేత కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు వెంకటస్వామి, సీఐటీయూ మండల కో-కన్వీనర్ అయాబ్‌ఖాన్, సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి పాల్గొన్నారు.

● కదిరిఅర్బన్ : అంబేడ్కర్‌ను పార్లమెంటు సాక్షిగా అవమానించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని వామపక్ష నాయకులు ఆదివారం డిమాండ్ చేశారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ఆయన దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. అమిత్‌షా రాష్ట్ర పర్యటనకు రాకూడదని, గో బ్యాక్ గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో జగన్మోహన్, రామమోహన్, బాబ్‌జాన్, ముస్తాక్, లియాకత్, పవన్‌కుమార్, మధునాయక్ పాల్గొన్నారు.



ధర్మవరం : నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు



కదిరి : అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వామపక్ష నాయకులు

కేబుల్ వైర్ దొంగలకు దేహశుద్ధి

బుక్కపట్నం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గునిపల్లి పరిసర పొలాల్లో మోటార్ల కేబుల్ వైర్లను చోరీచేస్తున్న ముగ్గురు దొంగలకు ఆ గ్రామస్థులు దేహశుద్ధి చేసి.. పోలీసులకు అప్పగించారు. శనివారం రాత్రి గ్రామ సమీపంలో వ్యవసాయ మోటర్ల నుంచి కేబుల్ వైర్లను ఆ ముగ్గురు దొంగలు కత్తిరించుకొని వెళ్తుండగా.. గ్రామస్థులు గుర్తించారు. వారిని పట్టుకుని, దేహశుద్ధి చేశారు. వారిని ఓ గదిలో బంధించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు దొంగలను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేస్తున్నారు.

రోడ్డుపక్కన కంపచెట్ల తొలగింపు



కంపచెట్లను తొలగిస్తున్న దృశ్యం, తొలగించిన అనంతరం

ధర్మవరంరూరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేలకోట, ఏలుకుంట్ల, తిప్పేపల్లి, వరదాపురం, మారాల గ్రామాలకు వెళ్లేందుకు రోడ్డుపక్కన కంపచెట్లు విపరీతంగా పెరిగాయి. దీంతో ఆ మార్గంలో ప్రయాణం చేయాలంటేనే ఆయా గ్రామప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీనిపై ఇటీవల ఆంధ్రజ్యోతి ఓ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన అధికారులు, టీడీపీ నాయకులు ఎక్స్‌కవేటర్‌తో సుమారు 30 కిలోమీటర్ల మేర ఆ రహదారుల పక్కన ఉన్న కంపచెట్లు తొలగించారు. దీనిపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ



పనులను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

ముదిగుబ్బ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక పాతూరు సచివాలయం నుంచి ముస్లీంల కబరస్తాన్ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి ఆదివారం టీడీపీ నాయకులు భూమిపూజ చేశారు. దశాబ్దాలుగా అధ్వానంగా ఉన్న ఈ రోడ్డును బాగుచేయాలని గత వైసీపీ ప్రభుత్వంలో ప్రజలు, స్థానికులు, ముస్లింలు పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సీసీరోడ్డుకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించడంతో ప్రజలు, ముస్లీంలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమేశ్‌బాబు, కరణం ప్రభాకర్, తుమ్మల మనోహర్, కోట్లబాబి, మల్లెల నారాయణస్వామి, బాసినేని మహేంద్ర, డిష్‌రామాంజి, నంద, బీజేపీ నాయకులు సోమలప్రకాశ్ పాల్గొన్నారు.

మన్‌కీ బాత్ వీక్షణ

ధర్మవరం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 28వ వార్డు 237 పోలింగ్ బూత్‌లో బీజేపీ నాయకులు ఆదివారం ఏర్పాటు చేసిన ప్రదాన మంత్రి నరేంద్రమోడీ మన్ కీ బాత్ ప్రత్యక్ష కార్యక్రమాన్ని ప్రజలు వీక్షించారు. ప్రతినెల చివరి ఆదివారం ప్రధాని మోడీ తన మనస్సులోని మాటను దేశ ప్రజలతో పంచుకోవడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఈనెల చివరి ఆదివారం రిపబ్లిక్ కావడంతో వారం ముందే ఈ కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు జింకా చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు సాకే ఓబుళేశు, చంద్రమహేశ్, ప్రజాపతి, నాగమణి, సుబ్రమణ్యం, సాయికృష్ణ, రవికుమార్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

శరవేగంగా సబ్‌స్టేషన్ పనులు



నిర్మాణంలో ఉన్న సబ్ స్టేషన్

పరిగి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పైడేటి గ్రామ సమీపంలోని సబ్‌స్టేషన్ పనులు శరవేగంగా పూర్తవుతున్నందున గ్రామంలోని ప్రజలందరూ సంతోషం వ్యక్తం చేశారు. నిర్మాణం కోసం బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవిత గతంలో భూమిపూజ నిర్వహించారు. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం జరిగితే శీగుపల్లి, గణపతిపల్లి, వంగలపల్లి, నర్సాపురం, బీరేపల్లి, విట్లాపల్లి, చిన్నపల్లివలు గ్రామాల్లో విద్యుత్ సమస్య పరిష్కారమై రైతులకు నిరంతరం సరఫరా చేయవచ్చని అధికారులు తెలిపారు.

కర్ణాటక మద్యాన్ని అరికట్టండి

సోమందేపల్లి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కర్ణాటక మద్యం ఏరులై పారుతోందని వాటిని ఆశాఖ అధికారులు అరికట్టాలని టీడీపీ పట్టణాధ్యక్షులు వడ్డెసూరీ, మాజీ ఎంపీటీసీ కిష్టప్ప కోరారు. ఆదివారం విక్రయిస్తున్న ప్రదేశాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయకనగర్, శివానగర్, మారుతినగర్, నక్కలగుట్ట, కాలనీ, తదితర ప్రాంతాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్నారు. బహిరంగంగానే కర్ణాటక మద్యం విక్రయాలు జరుపుతున్నా చర్యలు చేపట్టకపోవడం శోచనీయమన్నారు. తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో వారిని తామే పట్టుకుని బహిరంగ పరుస్తామని హెచ్చరించారు.

ఘనంగా సమ్మేళనం

పావగడ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో తుమకూరులో జరిగిన 39వ మహాసమ్మేళన సభ ఆదివారం సాయంత్రం ఘనంగా ముగిసింది. ఈ సమ్మేళనంలో శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య పాల్గొని విలేకరులకు ఆరోగ్యబీమా, బస్‌పాసు, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. నిజాలను ఎప్పుడూ నిర్భయంగా రాయాలని పార్టీలకు అతీతంగా కథనాలు రాయాలని సూచించారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన విలేకరులు ముఖ్యమంత్రికి జ్ఞాపికను అందజేసి ఘనంగా సత్కరించారు. పావగడ నుంచి అనేక మంది విలేకరులు సమావేశంలో పాల్గొని విజయవంతం చేశారు.

నేడు పురానికి బాలకృష్ణ

హిందూపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సోమవారం హిందూపురంకు వస్తున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన హిందూపురం చేరుకుని ఇటీవల మృతి చెందిన జీ వెంకటస్వామి కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు. మంగళవారం హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేయనున్నారు. చిలమత్తూరు మండలం బ్రహ్మేశ్వరంపల్లిలో వాటర్‌ప్లాంట్ ప్రారంభిస్తారు. సాయంత్రం అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తారు. ఈనెల 22 ఉదయం హిందూపురం నుంచి అనంతపురం వెళ్లి అక్కడ జరిగే డాకు మహరాజ్ సినిమా విజయోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు.

క్రైం కార్నర్

ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి

లేపాక్షి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తి మృతిచెందిన సంఘటన శనివారం రాత్రి 11గంటల ప్రాంతంలో మానెంపల్లి పంచాయతీ వెంకటాపురం వద్ద చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు హిందూపురంలోని శ్రీకంఠపురం ప్రాంతానికి చెందిన వెంకటేశ్(45)కు కర్ణాటక ప్రాంతం జీలగుంట వద్ద వ్యవసాయ పొలం ఉంది. అక్కడ వ్యవసాయ పనులు ముగించుకుని తన ద్విచక్ర వాహనంలో శ్రీకంఠపురానికి వస్తుండగా వెంకటాపురం వద్ద అదుపుతప్పి గుంతలో పడ్డాడు. అటుగా వస్తున్న ప్రయాణికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతునికి భార్య పార్వతి ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు లేపాక్షి పోలీసులు తెలిపారు.

ఆటో ప్రమాదంలో వ్యక్తి మృతి



పళని(ఫైల్)

పరిగి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన పళని(48) ఆటో ప్రమాదంలో శనివారం రాత్రి మృతిచెందాడు. జమేదార్ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు పళని ఐడీహళ్లిలో ఉన్న తన భూమిని చూసుకుని తిరిగి వెళ్లడానికి హిందూపురం వెళ్లే ఆటో ఎక్కాడు. ఆటో మండల పరిధిలోని మోదా సమీపంలోని ఐరన్ ఫ్యాక్టరీవద్ద వేగంగా వెళ్లడంతో కుదుపులకు అందులో నుంచి జారిపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. హిందూపురం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతిచెందాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు జమేదార్ తెలిపారు. ప్రమాదానికి కారణమైన ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, జనవరి19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మోహరావుకాలనీకి చెందిన ఓ వివాహిత క్రిమిసంహారక మందు తాగి ఆదివారం అస్వస్థతకు గురైంది. దంపతుల మధ్య వివాదం నెలకొనడంతో మనస్థాపానికిగురైన ఆమె బొద్దింకలు, దోమల సంహారానికి ఉపయోగించే హిట్ ద్రావణాన్ని సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అస్వస్థతకు గురైన ఆమెను గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా, డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్స జరిపారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించారు.

నేడు ప్రజాదర్బార్

సోమందేపల్లి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి హాజరవుతారని టీడీపీ పట్టణ అధ్యక్షుడు వడ్డె సురేష్ తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను నేరుగా అర్జీల రూపంలో మంత్రికి ఇవ్వవచ్చన్నారు.

ఫ్లోరైడ్ రహిత తాగునీరు కలేనా?

- తాగునీటి పథకం పనులు పూర్తయితేనే సమస్య పరిష్కారం
- ఎన్నాళ్లయినా ముందుకు సాగని వైనం
- కోట్లు మంజూరైనా... నేరవేరని లక్ష్యం



అర్ధంతరంగా ఆగిన ట్యాంకు నిర్మాణం

మడకశిర,జనవరి19(ఆంధ్రజ్యోతి):పట్టణానికి ఫ్లోరైడ్ రహిత తాగునీటిని అందించేందుకు చేపట్టిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. వేసవి వచ్చిందంటే పట్టణాలలో తాగునీటి సమస్య పలుచోట్ల తీవ్రంగా నెలకొంటుంది. పలుమార్లు పట్టణ ప్రజలు తాగునీటి కోసం ఆందోళనలు చేసిన సందర్భాలు ఉన్నాయి. పట్టణంలో ప్రతి ఇంటికి కొళాయి ఏర్పాటు చేసి శాశ్వతంగా తాగునీటిసమస్య పరిష్కరించేందుకు ఫ్లోరైడ్ రహిత తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం పుట్టపర్తి, మడకశిర మున్సిపాలిటీలతో పాటు మరో మూడు మున్సిపాలిటీలకు కాంప్రహెన్సివ్ వాటర్‌సప్లయ్ ఇంప్రూవ్‌మెంట్ పథకం కింద నిధులు మంజూరు చేసింది.

ఇందులో మడకశిర పట్టణానికి రూ.63కోట్ల నిధులు మంజూరు చేశారు. ఏఐఐబీ (ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు) ద్వారా 70 శాతం, ప్రభుత్వం నుంచి 30 శాతం నిధులతో ఈపనులు జరుగుతున్నాయి. ప్రారంభం నుంచి పనులు వేగవంతం కాలేదు. ఈపథకం పనులు రెండేళ్లలో పూర్తి కావాల్సి ఉంది. మడకశిర పట్టణ సమీపంలోని చెరువులో సంపు ఏర్పాటుచేసి ఏడు చోట్ల ట్యాంకుల నిర్మాణం చేస్తున్నారు. ఇప్పటి వరకు 30 శాతం పనులే జరిగినట్లు అధికారుల సమాచారం. పనులు వేగవంతమై పూర్తి అయితేనే పట్టణంలో శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కారం కానుంది. నియోజకవర్గ కేంద్రమైన మడకశిర చెరువులో సంపు ఏర్పాటుచేసి అక్కడ నుంచి పక్కలోనే ఉన్న గుట్టపై వాటర్‌ప్లాంటు నిర్మించి అక్కడ నీటిని శుద్ధిచేసి అక్కడ నుంచి పట్టణానికి రోజూ నీటిని అందించనున్నారు. పట్టణంలో 7 ట్యాంకులను నిర్మిస్తున్నారు. జూనియర్ కళాశాల ఆవరణంలో 7లక్షలలీటర్ల సామర్థ్యం గల ట్యాంకు, ఎస్సీ కాలనీలో 5లక్షలలీటర్లు, పావగడ రోడ్డు సమీపంలో 6లక్షలలీటర్లు, బేగార్లపల్లి, మారుతీనగర్, గొల్లహట్టి, మల్లినాయకనపల్లిలో ఒక్కొక్కచోట 3లక్షలలీటర్ల సామర్థ్యంగల ట్యాంకులను నిర్మిస్తున్నారు. మడకశిర పట్టణంలో 26 వేల జనాభా ఉంది. 30 సంవత్సరాల తరువాత జనాభా పెరిగినా నీటి సమస్య తలెత్తకుండా ఉండేవిధంగా ముందుజాగ్రత్తగా ట్యాంకుల నిర్మాణం చేపడుతున్నారు. ప్రస్తుతం ఉన్న జనాభా ప్రకారం ఈపథకం పూర్తయితే 40లక్షలలీటర్ల నీటిని సరఫరా చేస్తారు. అయితే ప్రస్తుతం చేపడుతున్న నిర్మాణాలు 50లక్షలలీటర్ల నీటిని సరఫరా చేసేవిధంగా జరుగుతున్నాయి. ప్రతి ఇంటికి కొళాయి ఏర్పాటుచేసి ప్రతివ్యక్తికి 135 లీటర్ల నీటిని అందించనున్నట్లు అధికారుల సమాచారం. ఈపథకం పనులు పూర్తయితే మడకశిర పట్టణంలో శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కారం కానుంది.

రెండేళ్లలోగా పనులు పూర్తి

ఒకటిన్నర సంవత్సరం లోగా తాగునీటి పథకం పనులు పూర్తి చేసి ప్రతి ఇంటికి తాగునీటిని అందిస్తామని జిల్లా పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ ఆఫీసర్లు ఆదినారాయణ, నరసింహమూర్తి తెలిపారు. ఇప్పటికి 20 శాతం దాకా పనులు పూర్తి అయ్యాయని, మిగిలిన పనుల కోసం కొత్తగా అంచనాలు వేసి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపుతున్నామన్నారు. నిధులు మంజూరైన వెంటనే టెండర్లు పిలిచి పనులు చేపట్టి ప్రజలకు తాగు నీటిని అందిస్తామన్నారు.

దర్శనంబు వేరు దైవంబదొక్కటే!

పలుచోట్ల ఘనంగా వేమన జయంతి



పెనుకొండలో కేక్ కట్‌చేస్తున్న దృశ్యం



మడకశిరలో..



పావగడలో..

ఎన్ని రకాలుగా కనబడినా దైవం ఒక్కటే అనే భావనతో విశ్వదాభిరామ వినురవేమ అంటూ పద్యాలను రచించి ప్రజలను జాగృతం చేసిన యోగివేమన జయంతిని ఆదివారం హిందూపురం, మడకశిర , పెనుకొండ, లేపాక్షి తదితర ప్రాంతాల్లో ఘనంగా జరుపుకున్నారు. పెనుకొండలో ఆదివారం రెడ్డి సంఘం ఆధ్వర్యంలో స్థానిక యోగివేమన సర్కిల్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ముద్దిరెడ్డిపల్లిలో ఆయన విగ్రహాన్ని పల్లకిలో ఉంచి ఊరేగించారు.



గోరంట్లలో..



ముద్దిరెడ్డిపల్లిలో..

వీరవనిత వణికె ఓబవ్వ అడుగు జాడల్లో నడుద్దాం

●ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

గుడిబండ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ కోటను సామంతరాజులు గతంలో పరిపాలించేవారని, ఆసామ్రాజ్యంపై దండయాత్రచేసిన శత్రు సైనికులతో పోరాడి సామ్రాజ్యాన్ని కాపాడిన వీరవనిత వణికె ఓబవ్వ అడుగుజాడల్లో అందరూ నడవాలని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, సీడబ్ల్యూసీ సభ్యులు రఘువీరారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే వై.టి.ప్రభాకర్‌రెడ్డిలు పేర్కొన్నారు. గుడిబండ మండలం మండలపల్లి గ్రామంలో ఆదివారం మాలమహానాడు సంఘం ఆధ్వర్యంలో వీరవనిత వణికె ఓబవ్వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్య అతిథులుగా వారు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మడకశిర నియోజకవర్గానికి ఆనుకొని ఉన్న కర్ణాటక ప్రాంతం చిత్రదుర్గ కోట ను సామంతరాజులు పరిపాలించేవారని, గతంలో శత్రుసైన్యం చిత్రదుర్గం కోటపై దండయాత్ర చేసిన సమయంలో వణికె ఓబవ్వ బరితెగించి శత్రుసైన్యాన్ని అంతమొందించిందన్నారు. అలాంటి వీరవనిత అడుగు జాడల్లో ప్రతి ఒక్కరు నడవాలని పిలుపునిచ్చారు. మడకశిర నియోజకవర్గంలో వీరవనిత వణికె ఓబవ్వ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు సూచించారు. ఉరుములు కొట్టే మాల సోదరులకు పింఛను అందించే విధంగా చర్యలు చేపడుతామన్నారు. మాల, మాదిగ అనే తేడా లేకుండా కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసి తాగునీరు, తదితర సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. వీరవనిత వణికె ఓబవ్వ జయంతి నిర్వహించడం ఎంతో సంతోషించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్‌కుమార్, డైరెక్టర్ కమలమ్మ, మాల మహానాడు తాలూకా అధ్యక్షులు పాండురంగప్ప, బసవరాజు, సోమశేఖర్, టీడీపీ మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, దాసిరెడ్డి, లక్ష్మీనారాయణ, గణేష్, పాండురంగప్ప, రొళ్ల జడ్పీటీసీ అనంతరాజు, కాంగ్రెస్ మండల కన్వీనర్ నాగరాజు, మందలపల్లి సర్పంచి అశ్వత్, మాల మహానాడు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

సంక్షేమ పథకాల అమలులో టీడీపీ విఫలం

వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష విమర్శ

పెనుకొండ రూరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి) : సంక్షేమ పథకాలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా ఆదివారం రొద్దం మండలంలోని తురకలా పట్నం గ్రామంలో వైసీపీ పార్టీనాయకులు, కార్యకర్తలతో కలిసి గుడ్‌మార్నింగ్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ప్రజలతో కలిసి అందరినీ పలకరించారు. అనంతరం అడదాకులపల్లి గ్రామంలో వైసీపీ నాయకుడు మంజునాథ్ తల్లి ఆదెమ్మ అనారోగ్యంతో మృతిచెందడంతో గ్రామా నికి చేరుకుని నివాళులు అర్పించారు. ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మంజునాథ్ కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమాల్లో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



మంజునాథ్ తల్లి మృతదేహంపై పూలమాల వేస్తున్న ఉష

జగన్ పాలనతో మూడు దశాబ్దాలు వెనక్కి.

మడకశిరటౌన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఆయన విధ్వంసం వలన అభివృద్ధి మూడు దశాబ్దాల పాటు వెనక్కు వెళ్లిందని రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం మడకశిర ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ఆవరణంలో విలేకరులతో మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేడ్కర్ విదేశీ విద్యానిధి పథకాన్ని జగన్ అన్న విదేశీ విద్య పథకంగా పేరుమార్చి అంబేడ్కర్‌ను అవమానపర్చారన్నారు. ఎస్సీల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశపెట్టిన 25 పథకాలను రద్దు చేసిన ఘనుడు జగన్ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరిగి బాబాసాహెబ్ అంబేడ్కర్ విదేశీ నిధి పథకంగా పేరు మార్చి అంబేడ్కర్‌కు గౌరవం తెచ్చిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. ఎస్సీ మాల కార్పొరేషన్ ద్వారా రైతు, రైతు కూలీల యాంత్రీకరణ, పనిముట్లను సబ్సిడీ రూపంలో త్వరలో ఇవ్వనున్నట్లు ఆశాభావం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంతోనే ఎస్సీలకు అన్ని విధాలా న్యాయం జరుగుతుందని అన్నారు.

మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించండి

పెనుకొండ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొత్తగా రీచార్జ్‌మీటరును ఏర్పాటు చేస్తోందని దీనివల్ల తమ ఉద్యోగాలు కోల్పోయే అవకాశముందని తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఏఐటీయూసీ మీటర్ రీడర్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్ మీటర్ రీడర్లకు ఎంపీ పార్థసారథికి వినతిపత్రం అందించారు. దీనిపై స్పందించిన ఎంపీ వారి సమస్యలపై ముఖ్యమంత్రితో చర్చిస్తానని హామీ ఇచ్చారు.

ఆసుపత్రికి వంట సామగ్రి వితరణ

సోమందేపల్లి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి శనివారం టీడీపీ నాయకులు వంట సామాగ్రిని వితరణగా అందించారు. చేనేత, టీడీపీ నాయకుడు సీసీ హరి పుట్టిన రోజు సందర్భంగా రూ.15వేలు విరాళం ఇవ్వగా, ఆ సొమ్ముతో వంట సామాగ్రిని అందించారు.

కాలుష్య రహిత ఆంధ్రప్రదేశ్‌ను నిర్మిద్దాం

● కొత్త హోండా వాహనం విడుదలలో ఆర్టీఓ



మార్కెట్లోకి వాహనాల విడుదల సందర్భంగా మాట్లాడుతున్న డీటీఓ

హిందూపురం అర్బన్, జనవరి 19, (ఆంధ్రజ్యోతి): కాలుష్య రహిత ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని డి.టి.ఓ కరుణాసాగర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని హోండా షోరూంలో ఆదివారం ఓబిడి-2బి అనే కాలుష్య నియంత్రణ సాంకేతికతో కూడిన కొత్త ద్విచక్రవాహనాన్ని లాంచ్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం కాలుష్యంతో కొన్ని నగరాలు సతమతమవుతున్నాయన్నారు. అలాంటి కాలుష్య నివారణకు ఉపయోగపడే వాహనాలు విడుదల చేయడం సంతోషమన్నారు. చెట్లను పెంచాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రోడ్ సేఫ్టీ విషయంలో ప్రతివాహనదారుడు బాధ్యతగా నడుచుకోవాలన్నారు. షోరూం ఎండి నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఈ వాహనం బ్లూటూత్, జీపీఎస్, నావిగేషన్, ఎల్ఈడి లైట్లతో ఆకర్షణీయంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంవిఐ ఉదయ్‌కుమార్, షోరూం మేనేజర్ శ్రీధర్, సబ్‌డీలర్లు సిబ్బంది పాల్గొన్నారు.

పెనుకొండలో శృంగేరి పీఠాధిపతికి ఘనస్వాగతం



విదుశేఖర భారతి స్వామిని స్వాగతిస్తున్న పుర ప్రముఖులు

పెనుకొండ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): శృంగేరి పీఠాధిపతి విదుశేఖర భారతి స్వామికి పెనుకొండలో ఘనస్వాగతం లభించింది. ఆయన హిందూపురం నుంచి బళ్లారి వెళ్తూ మార్గమధ్యంలో పెనుకొండ వైజంక్షన్ వద్ద ఆగిన సమయంలో స్వామిజీకి పెనుకొండ బ్రాహ్మణ సంఘం నాయకులు, పురప్రముఖులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అందరూ స్వామిజీ ఆశీస్సులను పొందారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం పెద్దలు వేదబ్రహ్మ నాగప్రసాద్ శర్మ, శేషప్పస్వామి, సుబ్రమణ్యస్వామి, నాగభూషణశాస్త్రి, పాలూరి క్రిష్ణమూర్తి, వీహెచ్‌పీ ప్రఖండ్ అధ్యక్షుడు వేదవ్యాస్, న్యాయవాది శర్మ, రవిశంకర్ గురూజీ దంపతులు శ్రీధర్ స్వామి, టీడీపీ నాయకులు మంత్రి సవిత భర్త వెంకటేశ్వర్లు, కన్వీనర్ శ్రీరాములు యాదవ్ స్వాగతం పలికారు.

కార్యకర్తలకు అండగా ఉంటా: ఎంపీ బీకే



హరిక్రిష్ణను పరామర్శిస్తున్న ఎంపీ బీకే పార్థసారథి

సోమందేపల్లి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా తాను అండగా ఉంటానని ఎంపీ బీకే పార్థసారథి తెలిపారు. ఆదివారం మండలంలోని నల్లగొంద్రాయనపల్లికి చెందిన రైతు సంఘం మండల అధ్యక్షులు హరిక్రిష్ణ, మండల ఉపాధ్యక్షులు ఆకుల రమణ కుమారులు అనీల్, హేమంత్‌లను ఆయన పరామర్శించారు. హరిక్రిష్ణ వైరల్ ఫీవర్‌తో బాధపడుతూ ఇటీవల అనంతపురం నుంచి డిశ్చార్జ్ అయి వచ్చారు. ఇటీవల తోపుడుబండ్ల వ్యాపారుల ఘర్షణలో అనీల్, హేమంత్‌లు గాయపడ్డారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎంపీ వారి గృహాలకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా వారికి అండగా నిలబడతానని తెలిపారు. ఎవరూ అధైర్యపడనవసరం లేదని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు కిష్టప్ప, నరసింహులు, యాదవ్, రామక్రిష్ణ, గుట్టు గోవిందు, జేసీబీ మారుతి, టీడీ బాబా, ఓబులేసు, గుడ్డపల్లి నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలకు గుండుమల నివాళి



రామప్ప భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న గుండుమల

మడకశిర రూరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని ఆర్ అనంతపురం పంచాయితీలో రేకులకుంట, ఆర్ అనంతపురం గ్రామాలకు చెందిన పార్టీ సీనియర్ నాయకుడు లక్ష్మీనరసప్ప, రామప్పలు అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ఆగ్రామాలకు వెళ్ళి మృతి చెందిన వారి భౌతికకాయాలపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి నరేశ్ కన్నా, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచు లోకేశ్ రామాంజనేయులు పాల్గొన్నారు.

లేపాక్షి శిల్పకళ అద్భుతం

లేపాక్షి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): దుర్గా వీరభద్రస్వామి ఆలయంలో శిల్ప, చిత్రకళలు అద్భుతంగా ఉన్నాయని కర్నాటక రాష్ట్ర ఆదాయ శాఖ కమిషనర్ విలాశ్‌షిండే అన్నారు. ఆదివారం ఆయన కుటుంబ సభ్యులతో ఆలయాన్ని సందర్శించారు. ఆలయగైడ్ రఘుస్వామి ఆలయ చరిత్రను, విశిష్టతను వివరించారు. ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అర్థాంతరంగా ఆగిన కళ్యాణమండపం, సీతాదేవి పాదం, వేలాడే స్థంబాన్ని సందర్శించి సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం దుర్గా, వీరభద్రస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. ఎంపీడీఓ నరసింహమూర్తి, రెవెన్యూ సిబ్బంది దుశ్శాలువలతో సన్మానించారు.

మురుగు కాలువకు మరమ్మతులు

గోరంట్ల, జనవరి19 (ఆంధ్రజ్యోతి): కదిరి ప్రధాన రహదారిలోని కసిరెడ్డిపల్లి వద్ద మురుగునీరు రోడ్డుపైకి వస్తుండ డంతో పంచాయతీ అధికారులు శనివారం మరమ్మతులు చేశారు. మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో ప్రజలకు, రాకపోకలకు తీవ్ర అసౌకర్యం ఏర్పడింది. ఈవిషయంపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఈనెల 17న కదిరి ప్రధాన రహదారిపై మురుగునీరు అన్న వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పంచాయతీ ఇఓ సుబ్రమణ్యం శనివారం పంచాయతీ సిబ్బందితో పైపులో నీరువెళ్లకుండా అడ్డుపడిన ప్లాస్టిక్‌వ్యర్థాలను తొలగించారు.